సాక్షి
కర్నూలు
గురువారం । 17 । జూలై । 2025



.. పైసా వసూల్!

కేసులకు సెక్షన్ల ప్రకారం న్యాయమూర్తులు విధించే ఫైన్ల కంటే కానిస్టేబుళ్ల పైసా వసూలే ఎక్కువవుతోంది. అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోకపోవడం లేదు. 8లో▸



కొకైన్ స్వాధీనం

బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సును పోలీసులు తనిఖీ చేశారు. ఒక ప్రయాణి కుడి వద్ద 10 గ్రాముల కొకైన్ లభించడంతో కేసు నమోదు చేశారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 40,117
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 29,607

న్యూస్‌రీల్

తొమ్మిది మండలాలకు స్త్రీనిధి రుణాల నిలుపుదల

కర్నూలు(అగ్రికల్చర్): స్త్రీనిధి రుణాలకు తొమ్మిది మండలాల స్వయం సహాయక సంఘాల మహిళలు దూరమయ్యారు. ఆయా మండలాల్లో బకాయిలు పేరుకుపోవడంతో పాదుపు మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి కింద తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.125 కోట్లు రుణాలుగా ఇచ్చారు. 2025–26లో రూ.195 కోట్లు పంపిణీ చేసేలా సెర్ప్ జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. జూన్ నెల వరకు రూ.22.75 కోట్లు రుణాలుగా పంపిణీ చేశారు. జూలై నెలలో రూ.25 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. బకాయిలు పేరుకుపోవడంతో తొమ్మిది(కోసిగి, ఆదోని, పెద్దకడబూరు, కర్నూలు, వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి, గూడూరు, మంత్రాలయం) మండలాలకు రుణాల పంపిణీని నిలిపి వేయడం పట్ల మహిళల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. జిల్లా మొత్తం మీద స్త్రీనిధి రుణాల బకాయిలు రూ.4.19 కోట్లు ఉన్నాయి. తీసుకున్న రుణాలను 11 శాతం వడ్డీతో 24 నెలల్లో రికవరీ చేయాల్సి ఉంది. స్త్రీనిధి రుణాలకు సంబంధించి బకాయిలు రూ.20 లక్షలకు మించితే లోనింగ్ నిలిచిపోతుంది. ఇదిలాఉంటే బకాయిలు పేరుకుపోవడానికి డీఆర్‌డీఏ సిబ్బంది అక్రమాలే ప్రధాన కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

20న ఐఐఐటీ స్నాతకోత్సవం

కర్నూలు(సిటీ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ఐఐఐటీడీఎం) 7వ స్నాతకోత్సవం ఈనెల 20న నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ కె.గురుమూర్తి తెలిపారు. స్నాతకోత్సవానికి ఇస్రో చైర్మన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ సెక్రటరీ, స్పేస్ కమిషన్ చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

28న షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక విఠల్ నగర్‌లోని గుడ్ షెప్పర్డ్ స్కూల్ మైదానంలో ఈనెల 28న జిల్లా స్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల మొదటి వారంలో నెల్లూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల జూనియర్స్ షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

రోడ్లు ఛిద్రమై.. ప్రయాణం నరకమై!



నాలుగు నెలలకే ఛిద్రం

పీఎంజీఎస్‌వై కింద రూ.480.50 లక్షల అంచనాతో కర్నూలు మండలం పసుపుల నుంచి గార్గేయపురం వరకు తొమ్మిది కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం 2024 మార్చి 6న ప్రారంభించి ఈ ఏడాది మార్చి 5న పూర్తి చేశారు. ఈ రోడ్డును ఐదు సంవత్సరాలు నిర్వహించేందుకు రూ.31.21 లక్షలుగా పేర్కొన్నారు. అయితే రోడ్డును ప్రారంభించిన నాలుగు నెలలకే పలు చోట్ల ఛిద్రమైంది.



రోడ్డు అధ్వానం

ఇది నంద్యాల జిల్లాలోని మండల కేంద్రమైన గోస్పాడు నుంచి తేళ్లపురికి వెళ్లే గ్రామీణ రోడ్డు. మొత్తం మూడు కిలోమీటర్ల రోడ్డులో ఒకటిన్నర కిలోమీటరు పూర్తి అధ్వానంగా తయారైంది. వర్షాలు కురిస్తే ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయం. నల్లరేగడి నేల కావడంతో బురదలో అవస్థలు తప్పని పరిస్థితి. ఈ రోడ్డు బాగుపడితే గోస్పాడు నుంచి తేళ్లపురి మీదుగా బనగానపల్లె చేరుకునేందుకు దూరం కూడా తగ్గుతుంది.

పల్లె రోడ్లు పట్టని ప్రభుత్వం

- గత వైఎస్సార్‌సీపీ పాలనలో కూటమి నేతల గగ్గోలు
- అప్పట్లో రూ.182.83 కోట్ల నాబార్డు నిధులు
- ఇప్పుడు ఉమ్మడి జిల్లాకు రూ.42.13 కోట్లు
- ఒక్కో నియోజకవర్గానికి రూ.5కోట్ల పనులకు ప్రతిపాదన
- రూ.3కోట్ల పనులకే మంజూరు
- ఆళ్లగడ్డ, డోన్ నియోజకవర్గాలపై వివక్ష

కర్నూలు(అర్బన్): గ్రామీణ రోడ్లను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. అధికారంలోకి రాక ముందు గ్రామీణ రోడ్లపై వివిధ రూపాల్లో హంగామా చేసిన కూటమి నేతలు నేడు రోడ్ల దుస్థితిపై పెదవి విప్పడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామాల ప్రజలు ఛిద్రమైన రోడ్లపై ప్రయాణాలు చేయలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ రోడ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఎలాంటి బడ్జెట్‌ను కేటాయించకుండా, కేంద్ర ప్రభుత్వ నిధుల(జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నాబార్డు, పీఎంజీఎస్‌వై) పైనే ఆధారపడటం వల్ల గ్రామీణ ప్రజలు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్ల ద్వారా అభివృద్ధి పనులను చేపట్టే అవకాశం ఉంది. అయితే అవసరాలకు అనుగుణంగా నిధులను సాధించుకోవడంలో వెనుకబడుతోంది. కొండంత ప్రతిపాదనలు పంపితే గోరంత మంజూరు తరహాలో రోడ్లకు నిధులు విడుదలవుతున్నాయి. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరాయి. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు గ్రామాల రోడ్ల పరిస్థితి చెప్పనలవి కావడం లేదు. కంకర తేలిన రోడ్లపైనే నేటికీ ప్రయాణిస్తున్న పరిస్థితి అనేక గ్రామాల్లో కనిపిస్తోంది.



గుంతలమయంగా సి.బెళగల్ మండలం చింతమానుపల్లె రోడ్డు

వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.182.83 కోట్లు

వైఎస్సార్‌సీపీ పాలనలో హైఇంపాక్ట్ రోడ్లుగా గుర్తించి ఆయా రోడ్ల పనులను పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో రూ.182.83 కోట్లతో 38 పనులు చేపట్టడం విశేషం.

రూ.65 కోట్లలో మంజూరు రూ.42.13 కోట్లే..

ఒక్కో నియోజకవర్గంలో నాబార్డు నిధులు రూ.5 కోట్లతో గ్రామీణ రోడ్లు నిర్మించనున్నట్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని పలు రోడ్ల పనులు చేపట్టేందుకు వీలుగా అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపారు. కర్నూలు అసెంబ్లీ మినహా మిగిలిన 13 నియోజకవర్గాలకు రూ.65 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. అయితే కేవలం ఒక్కో నియోజకవర్గానికి రెండు, మూడు పనులు చొప్పున మొత్తం 29 పనులకు రూ.42.13 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. అంటే ఒక్కో నియోజకవర్గానికి రూ.3 కోట్లకు మించకపోవడం గమనార్హం. కాగా ఆళ్లగడ్డ, డోన్ నియోజకవర్గాలకు ఒక్కో రోడ్డు పని మాత్రమే మంజూరు కావడం చూస్తే అక్కడి ప్రజాప్రతినిధులు ఏస్థాయిలో వెనుకబడ్డారో అర్థమవుతోంది. ఈ నిధులో కూడా 70 శాతం కేంద్ర ప్రభుత్వ వాటా కాగా, మిగిలిన 30 శాతం నిధులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది.

నిత్య నరకం



కర్ణాటక సరిహద్దు గ్రామాల రోడ్ల దుస్థితికి ఈ రహదారి అద్దం పడుతుంది. హొలహర్వి మండలం చింతకుంట గ్రామం నుంచి శిరిగాపురం, కొక్కెరచేడు, శ్రీధరహాల్, బేదినహాల్, టి.చాకిబండ తదితర కర్ణాటక సరిహద్దు గ్రామాలకు వెళ్లేందుకు ఈ రోడ్డే దిక్కు. ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం ఎలాగూ లేదు. దాదాపు అందరూ ద్విచక్ర వాహనాలపైనే ప్రయాణం చేస్తుంటారు. నిత్యం నరకమంటే ఏమిటో ఈ రోడ్లపై ప్రయాణం చేస్తే తెలుస్తుంది.

త్వరలో రెండో విడత నాబార్డు పనులు



నాబార్డు ద్వారా 2వ విడత కూడా పనులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. నియోజకవర్గానికి రూ.5 కోట్ల చొప్పున ప్రస్తుతం రూ.3 కోట్ల పైచిలుకు విలువ చేసే పనులకు ఆమోదం లభించింది. ఈ పనులకు టెండర్లు పిలవడం పూర్తయింది. పనులు కూడా పలు ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. పల్లె పండుగ వారోత్సవాల్లో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అంతర్గత రోడ్ల పనులకు సంబంధించిన బిల్లులు ఈ నెలలో కర్నూలు జిల్లాలో దాదాపు రూ.26 కోట్ల మేర విడుదలయ్యాయి. మిగిలిన బిల్లులను కూడా నెలాఖరులో విడుదల చేసే అవకాశం ఉంది.

– వి.రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ

అంతర్గత రోడ్లకు పెండింగ్‌లో రూ.50 కోట్ల బిల్లులు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు విడుదల కాని పరిస్థితి.
- గత ఏడాది అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు పల్లె పండుగ వారోత్సవాలంటూ ఊరూవాడా పందిళ్లు వేయించి రోడ్ల పనులను ప్రారంభించారు.
- ఈ పనులను 2025 సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని పరిగెత్తించారు.
- ఉమ్మడి జిల్లాలో రూ.150.04 కోట్లతో 1,916 పనులను పూర్తి చేశారు.
- అయితే పనులు పూర్తయి ఏడు నెలలైనా పూర్తి స్థాయిలో బిల్లులు విడుదల చేయకపోవడం గమనార్హం.
- ఈ పనులకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.50 కోట్ల మేర బిల్లులు విడుదల కాగా, ఆరు నెలల అనంతరం ఈ నెలలో ఇప్పటి వరకు రూ.50 కోట్లను విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు.
- ఈ లెక్కన ఇంకా, రెండు జిల్లాలకు రూ.50 కోట్ల మేర బిల్లులు విడుదల కావాల్సి ఉంది.

హంద్రీ–నీవా.. అక్రమాలు కనవా!

- అసంపూర్తిగా లైనింగ్ పనులు
- నాసిరకంగా మరమ్మతులు
- కాలువలో తొలగని మట్టి గుట్టలు
- నేడు నీరు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు



హంద్రీనీవా కాలువ నీటి డెలివరీ పాయింట్



నాసిరకంగా లైనింగ్ పనులు



మట్టి, రాళ్ల గుట్టను వదిలేసిన వైనం

కర్నూలు సిటీ/నందికొట్కూరు/పాములపాడు: రాయలసీమలోని కర్నూలు, వైఎస్సార్, చిత్తూరు, అనంతపురం జిల్లాల రైతులకు, ప్రజలకు సాగు, తాగునీరు అందించే హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రధాన కాల్వ అధ్వానంగా మారింది. కాల్వలో ఎక్కడి గుట్టలు అక్కడే ఉండిపోయాయి. లైనింగ్ పనులు నాసిరకంగా జరిగాయి. కాంట్రాక్టర్లు కనీసం పిచ్చి మొక్కలను సైతం తొలగించలేకపోయారు. మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి నేడు(గురువారం) హంద్రీ–నీవా ప్రధాన కాలువకు సీఎం చంద్రబాబు నీరు వదలనున్నారు. కాలువకు నీరు వదిలితే నాసిరకంగా నిర్మించిన లైనింగ్ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కాంట్రాక్టర్లు అయిన టీడీపీ నాయకులు నాణ్యత లేకుండా హంద్రీ–నీవా ప్రధాన కాలువకు మరమ్మతులు చేశారు. పనులు నాసిరకంగా చేసి జేబులు నింపుకున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి ప్రధాన కాలువపై నిర్మించిన 6వ బ్రిడ్జి వద్ద మట్టి, రాళ్ల గుట్టను కాంట్రాక్టర్లు అలాగే వదిలేశారు. అలాగే ఆ బ్రిడ్జి వద్ద హంద్రీ నీవా కాలువ లైనింగ్ నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టారు. నాణ్యత లేకుండా కాంట్రాక్టర్లు చేసిన పనులకు ఇవి గుర్తుగా మిగిలాయి. హంద్రీ–నీవా కాలువ అధ్వానంగా ఉండగా సీఎం చంద్రబాబు వదిలిన నీరు ఆయకట్టుకు చేరుతుందా.. ప్రజల గొంతు తడుపుతుందా.. అనే ప్రశ్నలు వస్తున్నాయి.

‘చంద్ర’ గ్రహణం

హంద్రీ–నీవా కాలువ నిర్మాణానికి 1996 మార్చి 11న ఉరవకొండలో, 1999 జూలై 9న ఆత్మకూరులో ఎన్.చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తొమ్మిదేళ్లు సీఎంగా పని చేసినా హంద్రీ– నీవాను పట్టించుకోలేదు. అయితే ‘తానే హంద్రీ–నీవాను తెచ్చానని, అదే తన ఆలోచన’ అని తప్పు ప్రచారం చేస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ వెనుకటి జలాలను 40 టీఎంసీలను ఈ కాలువ ద్వారా తరలించాల్సి ఉంది. చంద్రబాబు హయాంలో 2017–18లోనే విస్తరణ పనులు కొంత చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

హంద్రీ–నీవా కాలువ సామర్థ్యం తగ్గడంతో చిత్తూరు జిల్లాకు కృష్ణా జలాలు ఆశించిన స్థాయిలో చేరడం లేదు. శ్రీశైలం డ్యాం వెనుక జలాలను తక్కువ రోజుల్లోనే ఎక్కువ తరలించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంచనాలు వేసింది. కాల్వ సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు విస్తరించే పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే మొదటి ఫేజ్ పరిధిలో రెండు ప్యాకేజీలుగా రూ.687 కోట్లతో అంచనాలు వేసి టెండర్లు పిలిచింది. ఎన్నికల కోడ్ రావడంతో గతేడాది పనులు మొదలు పెట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు ఆలస్యంగా మొదలు పెట్టారు.

- హంద్రీ– నీవా కాంట్రాక్టుల నుంచి డిస్ట్రిబ్యూటరీ పనులను తొలగిస్తూ 2015 ఫిబ్రవరి 23న చంద్రబాబు జీఓ నంబరు 22 ను జారీ చేశారు. దీంతో జిల్లాతో పాటు, సీమలోని మిగిలిన జిల్లాల్లోనూ డిస్ట్రిబ్యూటరీల పనులు సైతం నిలిచిపోయాయి. దీంతో ఆయకట్టు కాకుండా కేవలం చెరువులను నింపేందుకు మాత్రమే హంద్రీ–నీవాను వినియోగించుకుంటున్నారు.
- టీడీపీ పాలనా కాలంలో 2017–18లో ప్రధాన కాలువను 3,850 క్యూసెక్కులకు విస్తరించేందుకు చేపట్టిన మట్టి పనుల్లో భారీగా అవినీతి జరిగింది. లైనింగ్ చేసి చోట సైతం నాణ్యత పాటించకపోవడంతో కంకర తేలింది. అప్పట్లో చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడుగా పేరొందిన ప్రస్తుత అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ రెండు ప్యాకేజీల్లో రూ.385.59 కోట్లతో విస్తరణ పనులు చేశారు.

ఆలస్యంగా పనులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హంద్రీ– నీవా కాలువ విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగాయి. జూన్ 10 నాటికే విస్తరణ పనులు కాంట్రాక్టర్లు పూర్తి చేయలేకపోయారు. ఈ నెల మొదటి వారంలో విస్తరణ పనులపై జరిగిన సమీక్షలో 12వ తేదీకి ఓ కాంట్రాక్టర్, 14వ తేదీకి మరో కాంట్రాక్టర్ పూర్తి చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. మొదటి ప్యాకేజీలో కల్లూరు మండలం వామసముద్రం దగ్గర, సఫా ఇంజినీరింగ్ కాలేజీ దగ్గర ఇంకా పూర్తి కాలేదు. సెకండ్ ప్యాకేజీలోను పనులు పూర్తి కాలేదు. అయితే నీటి విడుదలపై ఒత్తిళ్లు ఉండడంతో పనులు పూర్తి అయ్యాయని చెబుతున్నారు. కాల్వ విస్తరణ పనులు ఒక్కో చోట ఒక్కో కొలతతో చేసినట్లు తెలుస్తోంది.

జిల్లాలో 80వేల ఎకరాల ఆయకట్టు

- హంద్రీ–నీవా సుజల స్రవంతి రాయలసీమ ప్రాంతంలో పొడవైన కాలువ.
- దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు.
- కాలువ మొదటి దశ మల్యాల వద్ద మొదలై రాయలసీమ జిల్లాల్లో పారుతుంది.
- ఈ కాలువ మొత్తం 6.025 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది.
- రాయలసీమ జిల్లాలకు చెందిన 33 లక్షల మందికి తాగునీరు అందిస్తుంది.
- ఈ కాలువ కింద కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.
- జిల్లాలో 0.161 టీఎంసీల సామర్థ్యంతో కృష్ణగిరి, 1.126 టీఎంసీల సామర్థ్యంతో పందికోన రిజర్వాయర్లు ఉన్నాయి.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

నందికొట్కూరు: మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీ–నీవా కాలువకు నీటిని గురువారం సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారని, జలహారతి ఇవ్వనున్నారని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. అల్లూరు గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ స్థలాన్ని బుధవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. నీటి పంపింగ్ స్టేషన్, జలహారతి ఇచ్చే ప్రదేశం, సభాస్థలితో పాటు ఇతర ప్రాంతాలను వారు పరిశీలించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



సీఎం జలహారతి ఇచ్చే స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన కేసుల పరిష్కారం



ర్యాలీలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, న్యాయవాదులు

కర్నూలు(సెంట్రల్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అన్ని కోర్టుల్లో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ధి చెప్పారు. మధ్యవర్తిత్వంతో కేసులకు త్వరితగతిన పరిష్కారం లభించడంతో పాటు సమయం, డబ్బు వృథా కావన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో ప్రజల్లో మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేందుకు వన్ కే ర్యాలీని నిర్వహించారు. కోర్టు ప్రాంగణం నుంచి కొండారెడ్డి బురుజు వరకు కొనసాగిన ర్యాలీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి దివాకర్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరినాథ్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి, బార్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, మీడియేషన్ శిక్షణ పొందిన న్యాయవాదులు నాగేశయ్య, ఆశాబాయి, యూ.లక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ కర్నూలు ఈఈగా సునీల్‌రెడ్డి



కర్నూలు(అర్బన్): రోడ్లు భవనాల శాఖ కర్నూలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా సీవీ సునీల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఈగా విధులు నిర్వహించిన బి.సురేష్‌బాబును ప్రభుత్వం ఎస్ఈగా పదోన్నతి కల్పించి చిత్తూరుకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలోనే నంద్యాల జిల్లా కోవెలకుంట్ల డీఈఈగా విధులు నిర్వహిస్తున్న సునీల్ రెడ్డికి ఈఈగా పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేశారు. ఈఈగా బాధ్యతలు చేపట్టిన సునీల్ రెడ్డికి ఈఈ సిద్దారెడ్డి, కార్యాలయ డీఏఓ ఓ పురుషోత్తంరెడ్డి, హెచ్‌డీ చంద్రశేఖర్‌బాబు, డివిజన్ పరిధిలోని డీఈఈ, ఏఈలు, కార్యాలయ సిబ్బంది పూలబొకేలు అందించి అభినందనలు తెలిపారు.

హెచ్‌ఎంలకు నాయకత్వ శిక్షణ

కర్నూలు (సిటీ): ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి నాయకత్వ శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ తరగతులను బుధవారం డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు వారు పనిచేస్తున్న స్కూల్‌కి లీడర్ అని, ప్రతి హెచ్ఎం నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల హాజరు, విద్యార్థులకు అందుతున్న పథకాలు, టీచర్ల బోధన తీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు హెచ్ఎంగా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంపోస్ట్ పిట్స్ తవ్వకానికి ప్రోత్సాహం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కంపోస్ట్ పిట్‌ను తవ్వుకునే అవకాశం ఉందని డ్వామా అదనపు పీడీ మాధవీలత తెలిపారు. కంపోస్ట్ పిట్‌లు తవ్వుకోవడానికి మూడు పనిదినాలు ఇస్తారని పేర్కొన్నారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. పశువుల వ్యర్థాలు, వంట గది వ్యర్థాలు తదితర వాటిని కంపోస్ట్ పిట్‌లో వేస్తే కుళ్లి ఎరువుగా మారుతుందని తెలిపారు. ఇది పంటలకు చక్కటి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కంపోస్ట్ పిట్‌లు తవ్వుకోవడంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. 2025–26లో 20 వేల కంపోస్ట్ పిట్‌ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటివరకు 2017 మంజూరు చేయగా 258 పిట్‌లను తవ్వుకున్నారని వివరించారు. కంపోస్ట్ పిట్ తవ్వుకోవాలనే ఆసక్తి గలవారు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు లేదా ఏపీఓలను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో దేశభక్తి



ఎన్‌సీసీ క్యాడెట్లతో డీడీజీ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలాని

కర్నూలు(అర్బన్): ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలాని అన్నారు. బుధవారం కర్నూలుకు వచ్చిన ఆయన ఎన్‌సీసీ గ్రూప్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కర్నూలు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి, పర్యవేక్షణాధికారి కల్నల్ డొనాల్డ్ సైమన్స్ పీటర్స్, ట్రైనింగ్ అధికారి కల్నల్ అనిరుధ్ ఖజూరియా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం 9వ ఆంధ్ర బాలికల బెటాలియన్ కార్యాలయాన్ని, ఎన్‌సీసీ క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. డీడీజీకి ఎన్‌సీసీ క్యాడెట్లు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు.

కోర్టు కానిస్టేబుళ్ల పైసా వసూల్ !

- పెట్టి కేసుల్లో చేతివాటం
- వందల్లో ఫైను ఉంటే వేలల్లో వసూలు చేస్తున్న వైనం
- న్యాయవాదులతో ఒప్పందం కుదుర్చుకుని బేరసారాలు
- సొంత పొలాల్లో, ఇంటి ఆవరణలో మద్యం సేవిస్తున్నా వదలని పోలీస్ బృందాలు
- అధికారులకు కూడా వాటా ఉందంటూ గుసగుసలు



రసీదు రూ.600 వసూలు రూ.10 వేలు

శిరివెళ్ల సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్ సిబ్బంది కొంత కాలం క్రితం వాహనాల చెకింగ్ చేస్తుండగా రుద్రవరానికి చెందిన ఓ డ్రైవర్ డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డాడు. మరుసటి రోజు అతనితో పాటు సుమారు 20 మందిని కలిపి కోర్టులో హాజరు పరచగా జడ్జి జరిమానా విధించారు. జరిమానా చెల్లించేందుకు వెళ్లిన నిందితులతో సంతకం మాత్రం తీసుకున్నారు. సంతకం చేసే సమయంలో చూస్తే అందులో రూ.600 మాత్రమే రాసి ఉందని, తమతో మాత్రం ఒక్కొక్కరితో రూ.10 వేలు తీసుకున్నారని నిందితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇదే కేసులో కాస్త పలుకుబడి ఉన్న కొందరిని కోర్టుకు హాజరుకాకపోయినా పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని కేస్ క్లోజ్ చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ పెట్టి కేసుల్లో కోర్టు కానిస్టేబుళ్లు గూగుల్ పే, ఫోన్ పే కాకుండా కేవలం క్యాష్ మాత్రమే తీసుకుంటుండటం గమనార్హం.

ఆళ్లగడ్డ: కోర్టు కానిస్టేబుళ్లు కొందరు వసూల్ రాజాలుగా మారిపోయారు. నిత్యం వేల రూపాయలు అక్రమంగా దండుకుంటున్నారు. తెలిసో తెలియక చిన్నపాటి పొరపాటుతో దొరికిన నిందితులే టార్గెట్‌గా ఇష్టారీతిన డబ్బు గుంజుతున్నారు. పెట్టి కేసులకు సెక్షన్ల ప్రకారం న్యాయమూర్తులు విధించే ఫైన్ల కంటే కొందరు కానిస్టేబుళ్ల 'పైసా వసూలే' ఎక్కువవుతోంది. ఈ వ్యవహారం అంతా స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అందరికీ తెలిసినా పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఏదైనా నేరం రుజువైతే ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తారు. శిక్షలు పడేలా పోలీసులు చర్యలు తీసుకుంటారు. అయితే పెట్టి కేసులకు మాత్రం ఐపీసీ సెక్షన్లు వర్తించవు. చిన్న నేరాలకు పోలీసులే స్వయంగా లేదా ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే కేసులు పెట్టి కోర్టుకు హాజరు పరుస్తారు. నిందితులందరినీ కోర్టు కానిస్టేబుల్ ద్వారా కోర్టుకు పంపుతారు. జడ్జి వారిని నేరుగా విచారించి రూ.100 నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారు. ఆ జరిమానాను అక్కడే కోర్టులో చెల్లించి రసీదు కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

మధ్యవర్తుల అవతారం

కోర్టు కానిస్టేబుళ్లు కొందరు కేసులను అమ్ముకునే వ్యాపారం పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, హత్య, హత్యాయత్నం, ఇతర క్రిమినల్ కేసుల్లో నిందితలను భయభ్రాంతులకు గురిచేస్తూ పెద్ద మొత్తంలో సొమ్ము గుంజుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి కేసుల్లో దూర ప్రాంతాలకు చెందిన వారు నిందితులుగా ఉంటే కోర్టు కానిస్టేబుళ్ల దందా మూడు పువ్వులు.. ఆరు కాయలే. ఇతర ప్రాంతాలకు చెందిన నిందితులకు ఇక్కడి న్యాయవాదుల గురించి అవగాహన ఉండదు. దీంతో కోర్టు కానిస్టేబుళ్లే మధ్యవర్తులుగా మారిపోతున్నారు. ఇందుకోసం ఇటు నిందితుల నుంచి అటు లాయర్ల నుంచి డబుల్ బొనంజా పొందుతున్నారు.

రోజుకు 10 కేసులు.. ఒక్కొక్కరి నుంచి రూ.1,600

ఆళ్లగడ్డ రూరల్ సర్కిల్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రతి రోజు 10 పెట్టి కేసులు తేవాల్సిందే అని సిబ్బందికి హుకుం జారీ చేశారు. ఇందుకోసం రెండు టీంలు ఏర్పాటు చేశారు. వీరు ప్రతి రోజు సాయంత్రం గ్రామాల్లో తిరుగుతూ ఉండాలి. ఎవరూ దొరక్కపోతే పొలాల్లో కూర్చుని మద్యం తాగుతున్న వారినైనా పట్టుకుని పెట్టి కేసు పెడుతున్నారు. ఇదిలా ఉంటే సంబంధిత కోర్టు కానిస్టేబుల్ కోర్టుకు వచ్చే సమయంలో ఒక్కొక్కరు రూ.1600 తెచ్చుకోవాలని నిందితులకు చెబుతాడు. వారు ఆ మొత్తాన్ని కానిస్టేబుళ్‌కు ఇవ్వడం జరుగుతోంది. అతను వారిని కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.500 జరిమానా పడుతుంది. మిగతాది ఒక్కొక్కరికి రూ.1,100 చొప్పున 10 మందికి రూ.11 వేలు ఆ కానిస్టేబుళ్ జేబులో వేసుకుంటున్నారని సహచర కానిస్టేబుళ్లే ఆరోపించడం గమనార్హం. ఈ లెక్కన నెలకు సుమారు రూ. 3.30 లక్షలు అవుతుందని, అంటే ఏడాదికి ఎంత అవుతుందో అని లెక్కలు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పాముకాటుతో మహిళ మృతి



మృతి చెందిన నాగలక్ష్మమ్మ

రుద్రవరం: మండలంలోని ఎర్రగుడిదిన్నెకు చెందిన నాగలక్ష్మమ్మ (54) పాము కాటుకు గురై మృతి చెందింది. ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో రైతు పెద్ద నరసింహులు కుటుంబం పాడి గేదెలను మేపుతూ జీవనం సాగిస్తోంది. భార్య నాగలక్ష్మమ్మ రోజూ గేదెలను మేతకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో పొలం గట్లపై గడ్డి కోసి తీసుకొచ్చేది. బుధవారం ఉదయాన్నే వెళ్లి గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. అక్కడున్న పాడి రైతులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు విషయం తెలిపారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఓ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జర్నలిస్టు హెల్త్ స్కీం పొడిగింపు

కర్నూలు(సెంట్రల్): వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీంను 2025–26 ఆర్థిక సంవత్సరానికి పొడిగించినట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.జయమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జీఓ నంబర్ 77 విడుదల చేసిందన్నారు. అయితే డబ్ల్యూజేహెచ్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవడానికి రూ.1,250 ప్రీమియం చెల్లించాలని సూచించారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, దరఖాస్తు, రెన్యూవల్ చేయించుకున్న అక్రిడిటేషన్ జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లో ఉన్న సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించాలి



మొక్కజొన్న పైరుకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతులు

బనగానపల్లె: ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటను కత్తెర (గొంగళి) పురుగు ఆశించిందని, దీని వల్ల పంటకు నష్టం వాటిల్లుతుందని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త సుధాకర్ అన్నారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. కత్తెర పురుగు నివారణ చర్యలను వివరించారు. కత్తెర పురుగు మొదటి దశలో ఆకులపై పత్ర హరితాన్ని గీకి తింటూ రంధ్రాలను చేస్తుంది. పురుగు పెరిగే కొద్ది ఆకుల చివర నుంచి తింటూ కత్తిరించినట్లుగా పూర్తిగా తినేస్తుంది. దీన్నుంచి పంటను కాపాడుకునేందుకు పంట చుట్టూ నాలుగు వరసలు నేపియర్ గడ్డిని ఎరపంటగా వేసుకోవాలి. ఎకరానికి 4–5 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. గుడ్ల సముదాయాన్ని గుర్తించి ఏరి నాశనం చేయాలి. కత్తెర పురుగు గుడ్లను ఆశించే ట్రికో గ్రామ బదనికలను ఎకరానికి 20 వేలు చొప్పున పొలంలో విడుదల చేయాలి. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒక లీటరు వేప నూనెను 5 శాతం వేపగింజల కాషాయాన్ని పిచికారీ చేయాలని చెప్పారు. తొలి దశ గొంగలి పురుగులను నివారించేందుకు ఎకరానికి 500 మి.లీ. క్లోరోఫైరోఫాస్ లేదా 400 మి.లీ. క్వినల్‌పాస్ మందును పిచికారీ చేయాలని, ఎదిగిన గొంగలి పురుగు నివారణకు 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లం, రెండులీటర్ల నీరు కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమానికి 100 గ్రాములు థయోడికార్బ్ మందును జోడించి సాయంత్రం వేళ చుడుల్లో వేయాలన్నారు. ఈ పద్ధతి వల్ల పంటకు జరిగే నష్టాన్ని నివారించవచ్చని వివరించారు.

కొకైన్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

కృష్ణగిరి: మండల పరిధిలోని హైవే – 44పై అమకతాడు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం రాత్రి పోలీసుల తనిఖీలో మాదకద్రవ్యాలు లభ్యమైన విషయం తెలిసిందే.ఈ వ్యవహారంపై బుధవారం పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, వెల్దుర్తి సీఐ మధుసూదన్‌రావ్ స్థానిక సీఐ కార్యాలయంలో నిందితుడి అరెస్ట్ చూపారు. డీఎస్పీ, సీఐలు మాట్లాడుతూ.. కృష్ణగిరి ఎస్‌ఐ జి.కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సులో తనిఖీ చేయగా ప్రయాణికుడు బెల్లం అఖిల్ చౌదరి వద్ద రూ.80 వేలు విలువైన 10 గ్రాముల కొకైన్ లభించిందన్నారు. ఒంగోలుకు చెందిన అఖిల్‌చౌదరి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిసిందని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా డ్రగ్స్ అలవాటు ఉండటంతో బెంగుళూరులోని తన స్నేహితుడి వద్ద నుంచి తీసుకున్నట్లు చెప్పాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర పథకాలపై ప్రత్యేక బృందం తనిఖీ



కె.తిమ్మాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ఎమ్మిగనూరురూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై బుధవారం మండల పరిధిలోని కె.తిమ్మాపురం గ్రామంలో సెంట్రల్ టీమ్ సభ్యులు పర్యటించి, తనిఖీలు నిర్వహించారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు, చెక్ డ్యామ్‌ల పనితీరును పరిశీలించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు సంతోష్ పరీద్, సూర్యకాంత్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం అమలు, పెన్షన్లు, గృహ నిర్మాణాలతో పాటు ఇతర పథకాలను అమలు చేస్తోందని, అవన్నీ లబ్ధిదారులకు చేరుతున్నాయా, వాటి వల్ల ఉపయోగం పొందారా? అనే అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. పథకాల అమల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీడీ అల్లీపీరా, హౌసింగ్ డీఈ ప్రసాద్, సీఎల్ఆర్సీ కోర్సు డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, ఈఓఆర్డీ విజయలక్ష్మి, ఏపీఓ విజయమోహన్, ఎస్ఆర్ఈజీఎస్ ఈసీ, టీఏలు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీడీపీలో తగ్గిన నీటి నిల్వ



గాజులదిన్నె ప్రాజెక్టులో తగ్గిన నీటిమట్టం

గోనెగండ్ల: ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురువక పోవడంతో గాజులదిన్నె ప్రాజెక్టులో నీరు అడుగంటి పోతుంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా బుధవారం నాటికీ జీడీపీలో 1.65 టీఎంసీల నీటి నిల్వ (గ్రాస్) మాత్రమే ఉంది. డోన్, పత్తికొండ, క్రిష్ణగిరి మండలాల తాగునీటి పథకాలకు నీరు సరఫరా అవుతుంది. దీంతో జీడీపీలో రోజురోజుకు నీరు అడుగంటిపోతుంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో ఆశించినంత వర్షాలు కురువకపోవడంతో జీడీపీలోకి వరద నీరు చేరలేదు. గతంలో జూన్ చివరి నాటికి ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరేది. ఈ ఏడాది వర్షాలు కురువకపోవడంతో జూలైలో సగం రోజులు గడిచినప్పటికీ ప్రాజెక్టులోకి వరద నీరు చేరలేదు. దీంతో ప్రాజెక్టులో నీరు లేక వెలవెల బోతుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరితేనే ఆయకట్టు భూములు పంటల సాగుతో కళకళలాడుతాయి. సాగుచేసిన పంటలు కళకళలాడాలంటే వర్షం కురవాలని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నాయకత్వ లక్షణాలు మెరుగుపర్చుకోవాలి



ప్రసంగిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి

బండి ఆత్మకూరు: ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి సూచించారు. మండలంలోని పార్నపల్లి ప్రభాత్ కాలేజీలో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల హెడ్ మాస్టర్లకు జరుగుతున్న జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ లీడర్‌గా ఎదగాలి, నాయకత్వ లక్షణాలు ఎలా ఉండాలి, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యార్థులతో ఎలా మెలగాలన్న విషయాలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం సంతజూటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. నంద్యాల జిల్లా అల్టర్నేట్ కో–ఆర్డినేటర్ ప్రసన్నకుమార్ రెడ్డి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ జగన్‌మోహన్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారి యశోధ, సమగ్ర శిక్ష అభియాన్ డీటీపీ గాయత్రి, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, పీఆర్‌టీలు మస్తానయ్య, భానుబీ పాల్గొన్నారు.

అభిషేకం చేయిస్తానని మోసం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామి వారికి అభిషేకం చేయిస్తానని భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై బుధవారం శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు మాట్లాడుతూ.. హైదరాబాదుకు చెందిన 3 కుటుంబాల వారు ఈ నెల 14న శ్రీశైల మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చారు. పవన్ అనే వ్యక్తి వారికి గర్భాలయ అభిషేకం చేయిస్తానని చెప్పి రూ.15 వేలు వసూలు చేసి మోసం చేయడంతో బాధితులు దేవస్థానం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దేవస్థానం సీఎస్ఓ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి నిందితుడిని పట్టుకుని చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు పరిహారం

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పిడుగుపాటుతో మరణించిన వారి కుటుంబాలకు నష్టపరిహారం మంజూరైంది. కౌతాళం మండలం కాత్రికి గ్రామంలో తెలుగు అశోక్ ఏప్రిల్ 27న పిడుగుపాటుకు మరణించాడు. అదే నెల 30న ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామానికి చెందిన కోతిరాళ్ల రవి అలియాస్ బోయరవి పిడుగుపాటుతో మరణించాడు. మరణించిన వీరి కుటుంబాలకు రూ.4 లక్షల ప్రకారం ఎక్స్‌గ్రేషియా మంజూరైంది. కాగా 2024 ఆగస్టు నెలలో కురిసిన అధిక వర్షాలతో దెబ్బతిన్న 47 ఇళ్లకు రూ.1.88 లక్షలు డ్యామేజీ కింద మంజూరు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామీణ వైద్యుల గుర్తింపునకు కృషి



గ్రామీణ వైద్యుల మహాసభలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్

కర్నూలు (హాస్పిటల్): గ్రామీణ వైద్యుల గుర్తింపు కోసం కృషి చేస్తామని మంత్రి టీజీ భరత్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ చెప్పారు. స్థానిక కృష్ణా నగర్‌లోని బిర్లాగేట్ వద్ద ఉన్న లక్ష్మీ కళ్యాణ మండపంలో బుధవారం ఉమ్మడి జిల్లా గ్రామీణ వైద్యుల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి టీజీ భరత్, టీడీ జనార్దన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆర్‌ఎంపీల సేవలు ఉపయోగించుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ.. వైద్యుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామీణ వైద్యుల సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి సమస్యలపై మాట్లాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి ఎంఎస్ రాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పర్ల దస్తగిరి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఐ 24వ జిల్లా మహాసభలను ఆగస్టు 9, 10, 11 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్నట్లు మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథం, ట్రెజరర్ ఎస్.మునెప్ప తెలిపారు. స్థానిక సీఆర్ భవన్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు మహాసభల కరపత్రాలను సీపీఐ నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్ర్యం కోసం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక కుట్రలను ఎదుర్కొని పోరాటాలు చేసిందన్నారు. భూపోరాటాలు చేసి పేదలకు గూడు కోసం ఉద్యమించిన ఘన చరిత్ర పార్టీకి ఉందన్నారు. కర్నూలులో జిల్లాలోనూ ఎన్నో పోరాటాలు చేసిందని చెప్పారు. జిల్లా మహాసభల్లో భాగంగా మొదటి రోజు వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేయోభిలాషులు, పెద్దలు, దాతలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. నగర సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివాసరావు, జి.చంద్రశేఖర్, నాయకులు బీసన్న, నల్లన్న, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సగం కూలిన బ్రిడ్జి పిల్లర్లు



బ్రిడ్జి పైన వస్తున్న ఎడ్ల బండి

క్షణ క్షణం.. భయం భయం



సంగం కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

చిప్పగిరి: మండలంలోని ఆరు గ్రామాలతో పాటు హాలహర్వి మండలంలోని నాలుగు గ్రామాలకు ఏకైక మార్గమైన ఆ ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరి సంగం కూలి అత్యంత ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. మండల కేంద్రం చిప్పగిరి నుంచి ఏరూరు,డేగులహాలు,బంటనహాలు,గుమ్మనూరు,కాజీపురం,కొట్టాల,గ్రామాలతో పాటు హాలహర్వి మండలంలోని చింతకుంట,సిరిగాపురం,కొక్కర చేడు,మల్లికార్జున పల్లి గ్రామాలకు వెళ్లాలంటే చిప్పగిరి సమీపంలో ఉన్న ఏబీసీ కెనాల్ దాటడానికి వంతెన నిర్మించారు. అయితే ఇది శిథిలావస్థకు చేరింది. కింద భాగంలో సగానికి పైగా గోడలు కూలిపోయాయి. ఆయా గ్రామాలకు వెళ్లే వారితో ఈ దారి నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ఎప్పుడు కూలుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు నీటిని విడుదల చేస్తే కూలిపోయే అవకాశముందని పలువురు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

బ్రిడ్జి గోడలు సగానికి పైగా కూలిపోయిన మాట వాస్తవమే. మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక పంపాం. అక్కడి నుంచి అనుమతులు రాగానే మరమ్మతు పనులు చేపడతాం. అంతవరకు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భారీ వాహనాలు తిరగకుండా చర్యలు చేపడతాం.
– అల్లాబకాష్, ఎంపీడీఓ

● నారుమడికి రక్షణ 'వల'యం



జి. సింగవరంలో నారుమడి చుట్టూ రక్షణగా వలను ఏర్పాటు చేసిన దృశ్యం

కేసీ కెనాల్‌కు సాగు నీరు విడుదల కావడంతో మండలంలోని రైతులు వరినాట్లు వేసుకొనే పనుల్లో నిమగ్నమయ్యారు. వరి నాటుకు ముందుగా రైతులు నారుమళ్లను పొలంలో సిద్ధం చేసుకోవలసి ఉంటుంది. నారుమడిని 25 రోజులపాటు కంటికి రెప్పలా కాపాడుకుంటేనే వరి పంటకు నాటు వేసేందుకు అవకాశం ఉటుంది. మండల పరిధిలోని నిడ్జూరు, జి.సింగవరం, ఆర్. కొంతలపాడు, సుంకేసుల, పడిదెంపాడు, ఆర్.కె.దుద్యాల, ఎదురూరు, తులశాపురం గ్రామాల్లో రైతులు అధికంగా వరి పంటను సాగు చేస్తారు. ఈ క్రమంలో జి.సింగవరంలో ఓ రైతు వినూత్నంగా ఆలోచించి వరి నారుమడిని పక్షులు, జంతువులు నాశనం చేయకుండా చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేశాడు. నారుమడి చుట్టూ కర్రలు పాతి 5 అడుగుల ఎత్తులో వల ఏర్పాటు చేసి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. – కర్నూలు(రూరల్)